# హైజాకర్స్

'నా మ్యారేజి సెటిలైంది గురూ!' అన్నాడు వారం రోజుల తర్వాత ఆఫీసుకొచ్చిన సురేందర్ – తనతో ఆ ఆఫీసులో పని చేస్తున్న తన మిత్రులందర్నీ చూస్తూ.

'కంగ్రాచ్యులేషన్స్! ఎంత కాలానికింత మంచి శుభవార్త చెప్పావురా!' అన్నాడు గుర్నాథం తను చేస్తున్న పని ఆపేసి సురేందర్ దగ్గరకొచ్చి అతని వీపు మీద చరుస్తూ.

సురేందర్ క్లోజ్ ఫ్రెండ్స్ అందరూ అతని చుట్టూ చేరారు. ''నీకు పిల్లనిస్తున్న వాళ్లు బాగా ఉన్నవాళ్లేనా?'' అన్నాడు కిశోర్‌కుమార్.

''దే ఆర్ లాఖియర్స్'' అన్నాడు సురేందర్ గర్వంగా.

''నీకెన్ని లాక్స్ ఇస్తున్నారేమిటి?'' అన్నాడు సూర్యనారాయణ.

''ఓ లక్ష కాష్... బజాజ్ చేతక్, ఒనిడా కలర్ టి.వీ., గోద్రెజ్ ఫ్రిజ్, ఓ 50 వేలు ఖరీదు చేసే ప్లాట్ వగైరా..వగైరా...'' అన్నాడు సురేందర్.

''నీ రొట్టె విరిగి నేతిలో పడిందిరా సూరిగా! భలే లక్కీ ఛాన్స్ కొట్టేశావు. పెళ్లెక్కడ? మన హైదరాబాద్‌లోనేనా?'' అన్నాడు మధుసూదన్‌రెడ్డి.

''కాదురా రెడ్డి !మిర్యాలగూడా దగ్గరుండే మా మామగారి ఊళ్లో'' అన్నాడు సురేందర్.

''గోవిందా! గోవిందా! ''సురేందర్ చుట్టూ ఉన్న అతని అయిదుగురు ఫ్రెండ్స్ ఒకేసారి గొల్లుమని అరిచారు.

''ఎందుకురా అలా అరిచారు?'' అన్నాడు సురేందర్.

''మిర్యాలగూడ దగ్గరి పల్లెటూర్లో మాకేం దొరుకుతుందిరా?'' అన్నాడు హమీద్.

''నీకు కాబోయే మామగారి దగ్గర నుంచి మేమో పెద్ద పార్టీ ...మేమెన్నడూ కనీవినీ ఎరుగనంతటి గ్రాండ్ పార్టీ తీసుకోవాలని ఆశపడ్డాం. నువ్వు మాకు ఎన్నోసార్లు నా పెళ్లికి మీకో గ్రాండ్ పార్టీ ఇస్తానని ప్రామిస్ చేశావు. మేం తిన్నంత చికెన్... మటన్... ఫిష్... ఎగ్స్... మేం తాగినంత విస్కీ.. అన్నట్టు నీ పెళ్లిలో మాకు స్కాచ్ తెప్పిస్తానన్నావు. ..వాట్ 69 తెప్పిస్తానన్నావు గుర్తుందా?'' అన్నాడు గుర్నాథం.

''అన్నీ గోవిందా! గోవిందా!'' మళ్లీ అరిచారు రెడ్డి, సూర్యనారాయణ, కిశోర్, హమీద్.

''మీరెందుకలా అనుకుంటున్నారు'' అడిగాడు సురేందర్.

''మిర్యాలగూడా దగ్గరుండే ఆ మారుమూల పల్లెటూర్లో ఏం దొరుకుతుందిరా బాబూ! మట్టి... అసలుమేమంత దూరం రావడం ఎలా?'' అన్నాడు గుర్నాథం.

'మీకా భయమేమీ అక్కర్లేదురా నాయనా! మీ కోసం ప్రత్యేకంగా ఓ స్పెషల్ బస్సు మాట్లాడుతున్నాను. మీకే ఇబ్బంది కలుగకుండా మిమ్మల్ని ఆ ఊరు తీసుకెళ్లే బాధ్యత నాది. అసలు మా మామగారితో పెళ్లి ఇక్కడే హైదరాబాద్‌లో చెయ్యండని, మా ఫ్రెండ్స్ రావడానికి కన్వీనియెంట్‌గా ఉంటుందని చెప్పాను - కా... ఆయన ఈ మధ్యనే వాళ్ల ఊర్లో కొత్త బిల్డింగ్ కట్టించాడట. కొత్తింట్లో అమ్మాయి పెళ్లి చెయ్యాలని ఆయన కోరిక. ఆయనకు నాగార్జునసాగర్ కాలవ కింద ముప్పై ఎకరాల మాగాణి ఉంది. ..'' ఇంకా తన మామగార్ని గురించి సురేందర్ చెప్పబోతుండగానే గుర్నాథం అందుకున్నాడు.

''అదంతా మాకనవసరం. మమ్మల్ని అక్కడికి తీసుకెళ్లి మాక్కావలసినవన్నీ అరెంజ్ చేసి, మమ్మల్ని తృప్తిపరచి మళ్లీ ఇక్కడకు క్షేమంగా తీసుకురావలసిన బాధ్యత నీది. రెండు, మూడు లక్షల కట్నం కొట్టేస్తున్నావు.. అందులో కనీసం ఫైవ్ పర్సెంటైనా మా మీద ఖర్చు పెట్టాలి'' అన్నాడు గుర్నాథం.

''ఒరే పిచ్చి గురూ! వాడెందుకు ఖర్చు పెడ్తాడురా! వాళ్ల మామగారి చేత ఖర్చు పెట్టిస్తాడు'' అన్నాడు హమీద్.

'అవుననుకో...మీ మామగారికి మొదలే మా విషయం చెప్పి అన్ని ఏర్పాట్లు మా కోసం ప్రత్యేకంగా చెయ్యాలి. తీరా అక్కడికి వెళ్లాక మాది పల్లెటూరు... ఇక్కడేం దొరుకుతుందని ఏ నాటుసారానో తెప్పించి పబ్బం గడుపుకోమంటే మాత్రం మేం ఊరుకోం'' అన్నాడు గుర్నాథం.

'నీకా సందేహం అక్కర్లేదురా ! అది పల్లెటూరే అయినా మన హైదరాబాద్‌లో కూడా దొరకని సరుకు దొరుకుతుంది'' అన్నాడు సురేందర్.

నిజానికి సురేందర్‌కు ఆ ఊరిని గురించి ఏమీ తెలీదు. తన ఫ్రెండ్స్ నిరుత్సాహపడకుండా వుండాలంటే అలా చెప్పడం అవసరమనిపించిందతనికి.

'వాట్ సిక్స్టీ నైన్ దొరుకుతుందా?' - రెడ్డి.

'బ్రాయిలర్ చికెన్.... తందూరీ చికెన్?' - సూర్యనారాయణ.

''ప్రాన్స్...పచ్చి రొయ్యలు?' - హమీద్.

'నాకైతే మేకపోతు కిడ్నీస్ కావాలి' - కిశోర్‌కుమార్.

''నాకైతే గొర్రెపోతు మెదడు..కార్జం కావాలి'' - గుర్నాథం.

''అన్నీ ఏర్పాటు చేయిస్తారా.....మా మామగారు లక్షాధికారి... ఇలాంటివన్నీ ఆయన నిమిషాల మీద అరెంజ్ చేయించగలడు'' అన్నాడు సురేందర్.

''నేనైతే చాలా షేమ్‌లెస్‌గా చెప్పేస్తున్నాను. నేను నీ పెళ్లికి కేవలం తినడానికి, తాగడానికి వస్తున్నాను. డిజప్పాయింట్ చేస్తే మాత్రం నాకు చాలా కోపం వచ్చేస్తుంది. నా కోపం సంగతి వాడికి తెలుసో, లేదో నువ్వైనా చెప్పరా గురూ!'' అన్నాడు సూర్యనారాయణ.

''వాడు బాపనోడు. ఇంట్లో నాన్‌వెజ్‌టేరియన్ దొరకదు. వాడికేమో నాన్‌వెజ్‌టేరియన్ డిషెస్ అంటే చచ్చేంత ఇష్టం. వాడికి నిజంగా కడుపునిండేది ఇలాంటి పెళ్లిళ్లలోనే... ఇదివరకొకసారి... నువ్వీ ఆఫీసులో చేరకముందు మా ఫ్రెండొకడు పెద్ద పార్టీ ఇస్తానని వాడి పెళ్లికి తీసుకెళ్లి వంకాయకూరతో సరిపెట్టుకోమన్నాడు. సూర్యనారాయణకు బాగా కోపమొచ్చి డైనింగ్ టేబుల్స్‌ని, కుర్చీలను బద్దలు చేసేశాడు'' అన్నాడు గుర్నాథం.

''వాడి కోపం సంగతి నాకు తెలుసురా గురూ! మొన్న మన ఆఫీసరు శ్రీనివాసరావు మీదకు చెప్పు లేబట్టగా మనందరం చూళ్లేదూ?'' అని సురేందర్ అనగానే అందరూ గొల్లున నవ్వారు.

''ఇంతకూ పెళ్లెప్పుడు?'' అన్నాడు రెడ్డి.

''డిసెంబర్ 15 నాడు. ... అంటే ఇంకా నెలరోజులుంది'' అన్నాడు సురేందర్.

''పెళ్లి ఎన్ని గంటలకు?'' అన్నాడు గుర్నాథం.

''డిసెంబర్ పధ్నాలుగు, పదిహేను మనకు పెద్ద పండగన్నమాట! నేనైతే పన్నెండు నుంచే ఉపవాసం మొదలెడ్తాను'' అన్నాడు సూర్యనారాయణ.

వాళ్లు అయిదుగురూ నవ్వుతూ తమ తమ సీట్లలోకి వెళ్లి కూర్చున్నారు.

సురేందర్ ఆ ఆఫీసులో కొత్తగా చేరాడు. చాలా పేద కుటుంబంలో పుట్టినవాడే. అయినా కష్టపడి చదువుకొని పబ్లిక్ సర్వీసు కమిషన్ పరీక్షలో మంచి మార్కులు తెచ్చుకుని ఈ ఉద్యోగం సంపాదించాడు. ఉద్యోగంలో చేరినప్పటి నుంచి అతనికి సంబంధాలొస్తునే ఉన్నాయి. బాగా డబ్బున్నవాళ్ల అమ్మాయిని చేసుకుని, ఉద్యోగంలో త్వరత్వరగా ప్రమోషన్లు సంపాదించి కార్లలో తిరుగుతూ, మేడల్లో విహరించాలని చాలా కాలంగా అతడు కలలు గనడం మొదలెట్టాడు. గుర్నాథం వాళ్ల ఆఫీసులో చాలా ఇంపార్టెంట్ మ్యాన్. అతడు వాళ్ల అసోసియేషన్ లీడరు. ఆఫీసర్లతో పోట్లాడి ఉద్యోగస్తుల హక్కులను రక్షిస్తుంటాడు. ఉద్యగుల యూనియన్‌కు ప్రతీసారీ అతడే అధ్యక్షుడుగా ఎన్నికవుతుంటాడు. కిశోర్‌కుమార్, సూర్యనారాయణ, హమీద్, రెడ్డి , సురేందర్ అతనిఅనుచరులు. ఒకటి రెండు సార్లు సురేందర్‌ను వాళ్ల ఆఫీసరు చివాట్లు పెడ్తే గుర్నాథం సురేందర్ తరపున ఆఫీసరు దగ్గరకు వెళ్లి అంతకు పదింతలు చివాట్లు పెట్టాడు. గుర్నాథం అన్నా, అతని ఆ అయిదుగురు అనుచరులన్నా ఆ ఆఫీసులో అందరూ భయపడతారు. గుర్నాథం ఆఫీసర్లతో చాలా దూకుడుగా మాట్లాడతాడు. నోటికి ఎంత మాటొస్తే అంత మాట అనేస్తాడు. అందువల్ల ఇతనితో పెట్టుకుంటే మన పరువుపోతుందని ఆఫీసర్లు సాధ్యమైనంత వరకు అతనితో అడ్జస్టయిపోవడానికి ప్రయత్నిస్తారు. యముడి

లాంటి తన ఆఫీసరు బారి నుండి గుర్నాథం తనను రక్షించాడన్న కృతజ్ఞతా భావం సురేందర్‌లో నాటుకుపోయింది.

గుర్నాథంకు, అతని అనుచరులకు పార్టీలంటే చాలా ఇష్టం. ఆఫీసులో పనిచేసే తన తోటి క్లర్కులకు గుర్నాథం, సూర్యనారాయణ మొదలైనవాళ్లు ఏదో పని చేసి పెట్టడం, వాళ్ల దగ్గర్నుంచి పార్టీలు తీసుకోవడం ఆ ఆఫీసులో అందరికీ తెలిసిన విషయమే. సురేందర్‌కు గుర్నాథానికి పెద్ద పార్టీ అరెంజ్ చేయాలని చాలా కాలంగా ఉంది. అందుకు తన పెళ్లి మంచి అవకాశమని అతడు భావించాడు.

* * *

డిసెంబర్ పధ్నాలుగువ తేదీ వచ్చేసింది.

మధ్యలో ఒకసారి తనకు కాబోయే మామగారు కలిసినప్పుడు సురేందర్ తన ఫ్రెండ్స్ విషయం చెప్పాడు.

''నా ఫ్రెండ్స్ చాలా మందొస్తారు. అందులో ముఖ్యంగా నేను పనిచేస్తున్న మా ఆఫీసు వాళ్లు....అంటే నా కొలీగ్స్. అందులో ఓ అయిదుగురు చాలా అసాధ్యులు. వాళ్లకు మాత్రం అరేంజ్‌మెంట్స్ చాలా గ్రాండ్‌గా జరగాలి...'' అన్నాడు సురేందర్.

'గ్రాండ్‌గా అంటే...' అన్నాడు వాళ్ల మామ రాఘవయ్య.

''గ్రాండ్‌గా అంటే ..పార్టీ చాలా ఘనంగా, వాళ్లు తృప్తి పడేలా ఉండాలి....''

''ఇదిగో చూడు బాబూ !నేను ఇదివరకు రెండు పెళ్లిళ్లు చాలా ఘనంగా చేసినవాడినే. ...ఎవర్ని ఎలా చూడాలో నాకు తెలుసు.పధ్నాల్గో తేదీ రాత్రే డిన్నర్ అరెంజ్ చేస్తాను. చాలా గ్రాండ్‌గానే అరేంజ్‌చేస్తాను. రాత్రి ఎనిమిది గంటల వరకే చేరుకునేలా రండి. నీ ఫ్రెండ్స్‌ను ఎంత తింటారో తినమను. చికెన్, మటన్, ఫిష్, ఫోర్క్...అన్నీ వుంటాయి'' అన్నాడు రాఘవయ్య.

''అవన్నీ సరే....కానీ నా ఫ్రెండ్స్ వాటితోటే తృప్తిపడరు.''

నసిగినట్టుగా కొంచెం భయపడ్తూ అన్నాడు సురేందర్.

''మరింకేం కావాలట?'' కోపంగా ధ్వనించింది రాఘవయ్య కంఠం.

''మా వాళ్లు కొంచెం డ్రింక్ చేస్తారు... డ్రింక్స్ తెప్పించకపోతే వాళ్లు సాటిస్ఫై అవరు...'' గుసగుసగా చెప్పాడు సురేందర్.

''నేను పెళ్లిలో డ్రింక్స్ తెప్పించదల్చుకోలేదు బాబూ! మా చుట్టాల్లో కూడా డ్రింక్స్ అంటే పడిచచ్చేవాళుచాలా మందే ఉన్నారు. డ్రింక్స్ తెప్పించామంటే పెళ్లినెవడూ పట్టించుకోడు. బాగా తాగి, ఒకరి మీదొకరు అరుచుకుని నానా బీభత్సం సృష్టిస్తారు. మా పెద్దమ్మాయి పెళ్లిలో సారాతెప్పించాను. అబ్బాయి తరఫున వచ్చినవాళ్లు బాగా తాగి, ఇంకా తెప్పించమని, ఇది సరిగ్గా లేదని, అది సరిగ్గా లేదని పేద్ద గొడవ చేశారు. మా తరఫు

బంధువులు కూడా తాగి ఉన్నారు. దాంతో అబ్బాయి తరఫు వాళ్లు, మా తరఫు వాళ్లు ఇంచుమించు కొట్టుకున్నంత పని చేశారు. మరోసారి పెళ్లిలో తాగించే పని పెట్టుకోవద్దని చాలా గట్టిగా నిర్ణయించుకున్నాను....'' అన్నాడు రాఘవయ్య.

మామగారు అంత గట్టిగా చెబుతుంటే అతనికి అర్థం కాలేదు. ఇప్పుడే అతని మనసు నొప్పిస్తే బావుండదేమో...వాళ్లది చాలా పెద్ద సంబంధం. కేవలం తన ఉద్యోగం చూసి వాళ్లు తనకు వాళ్ల అమ్మాయినిస్తున్నారు తప్ప , తన కుటుంబాన్ని గాని, ఆస్తిపాస్తులను గాని చూసి కాదు. ఈ సంబంధం పోయిందంటే తనకు మళ్లీ ఇంత గొప్ప సంబంధం దొరకదు. మామగారితో ముందు ముందు తనకెన్నో అవసరాలుంటాయి. అందువల్ల తనంటే ఇప్పుడే అతనిలో బ్యాడ్ ఇంప్రెషన్ ఏర్పడగూడదు. అందువల్ల సురేందర్ ఆ టాపిక్‌ను అంతటితో వదిలేశాడు. అంతగా తన ఫ్రెండ్స్ గొడవ చేస్తే తనే కొంత డబ్బు ఖర్చుపెట్టి పెళ్లి నుంచి వచ్చాక హైదరాబాద్‌లోనే ఒక పార్టీ ఏర్పాటు చెయ్యచ్చులే అనుకున్నాడు.

సురేందర్ డిసెంబర్ పధ్నాలుగో తేదీ నాడు రెండు గంటలకు తన ఫ్రెండ్స్‌నందర్నీ రెడీగా వుండమని, ఆఫీసు దగ్గరకే బస్సు వస్తుందని చెప్పాడు. మిర్యాలగూడెం దగ్గర్లో వుండే రెడ్డిపాలెం అనే వాళ్ల మామగారి ఊరు వెళ్లిరావడానికి పది రోజుల ముందే ఒక ఆర్టీసి బస్సును మాట్లాడాడు. పెళ్లికొడుకు కోసం మాత్రం వాళ్ల మామగారు కారు పంపిస్తారని చెప్పాడు.

పన్నెండు గంటల వరకు బస్సొచ్చి సురేందర్ ఇంటి ముందు ఆగింది. అంతకు ముందే కారు కూడా వచ్చేసింది. సురేందర్ తన బంధువలందర్నీ బస్సెక్కించాడు. తన కోలీగ్స్ కోసమని ముందు వరసలో ఓ పదిసీట్లను రిజర్వ్ చేశాడు. సురేందర్ కోసం వాళ్ల మామగారు పంపించిన కార్లో అతనితో పాటు వాళ్ల అక్కలు, బావలు, వాళ్ల పిల్లలు కూర్చున్నారు. కారు ముందు వెళ్తుంటే, వెనక బస్సు బయలుదేరింది. సురేందర వాళ్ల ఆఫీసు ముందు ఆ రెండు వాహనాలొచ్చి ఆగాయి.

కార్లోంచి పెళ్లికొడుకు దిగి వాళ్ల ఆఫీసులోకెళ్లాడు. తన ఆఫీసులో పనిచేసే ఆఫీసర్లతో సహా అందరికీ ఆహ్వానాలు అందజేసినప్పటికీ సురేందర్ పెళ్లికి రావడానికి అయిదుగురు మాత్రమే సిద్ధమయ్యారు. రెడ్డి, హమీద్, సూర్యనారాయణ తమ బ్రీఫ్‌కేసుల్ని ఆఫీసుకే తెచ్చుకున్నారు. బస్సొచ్చి వాళ్ల ఆఫీసు ముందు ఆగిన అరగంట తర్వాత ఆ ముగ్గురు వచి బస్సెక్కారు. గుర్నాథం, కిశోర్‌కుమార్ వీళ్లిద్దరూ తమ ఇంటి దాకావెళ్లాలని, తాము స్కూటర్ల మీద వెళ్తుంటే బస్సు తమను ఫాలో కావాలని చెప్పి వాళ్లిద్దరూ తమ స్కూటర్లను షెడ్ లోంచి బయటకు తెచ్చుకుని స్టార్ట్ చేశారు. ఆ స్కూటర్ల వెనుక కారు, కారు వెనుక బస్సు బయలుదేరాయి. అలా ఒక అరగంట సేపు హైదరాబాద్ లోని సందుగొందులన్నీ తిరిగాక మొదట కిశోర్‌కుమార్ ఇల్లొచ్చింది. ఒక అరగంట తర్వాత కిశోర్ తన బ్రీఫ్‌కేసుతో బస్సెక్కాడు. కిశోర్ ఇంటికి కొంచెం దూరంలోనే గుర్నాథం ఇల్లుంది. మరో అరగంట గుర్నాథం ఇంటి ముందు ఆగాక గుర్నాథం తన బ్రీఫ్ కేసు సర్దుకుని బస్సెక్కాడు.

వాళ్లిద్దర్ని ఎక్కించుకుని బస్సు మిర్యాలగూడ వైపు బయల్దేరేటప్పటికి అయిదు దాటింది.

మధ్యలో బస్సు డ్రైవరు పెద్ద గోడవ చేశాడు.

''బస్సు రెండింటికే బయల్దేరాలని చెప్పారు. ఆఫీసు దాకా వస్తే చాలు నా కొలీగ్స్ అక్కడ రెడీగా ఉంటారన్నారు. ఇప్పుడేమో సిటీ అంతా తిప్పుతున్నారు. ఏమిటిది? అయిదైనా ఇక్కడే ఉన్నాము. నేనసలు రానే రాను. బస్సును తీసుకెళ్లి డిపోలో పెట్టేస్తాను'' అన్నాడు డ్రైవరు.

సురేందర్ కార్లోంచి దిగొచ్చి ఎంతో బతిమాలితే గాని డ్రైవరు బస్సును స్టార్ట్ చేయటానికి అంగీకరించలేదు.

బస్సు గుర్నాథం ఇంటి ముందు ఆగినప్పుడు సురేందర్ బస్సులో వున్న కొందరు తన ముఖ్యమైన బంధువుల్ని తన కొలీగ్స్‌కు పరిచయం చేశాడు.

''ఈయన కేశవరావు గారు. నాకుపెదనాన్న అవుతారు. ఈ పెళ్లి కుదరటానికి వీరే కారకులు. అటు నాకు కాబోయే మామగార్కి, ఇటు మాకు చాలా సన్నిహితుడు. వీరు హైకోర్టు అడ్వకేటు. మా బంధువులందరికీ వీరంటే చాలా గౌరవం. నిజానికి వీర్ని ఇలా బస్సులో కూర్చోబెట్టడం చాలా అన్యాయం. నాతోపాటు వీర్ని కార్లో తీసుకురావాలని మా మామగారు ప్రత్యేకంగా చెప్పారు. కాని కారు నిండా మా అక్కలు, బావలు కూర్చున్నారు. వాళ్లను లెమ్మనడం ఏం బావుంటుందని వీర్ని బస్సెక్కించాల్సి వచ్చింది'' అన్నాడు సురేందర్.

''పరవాలేదు లెండి ఎలాగో అడ్జస్టయిపోదాం....ఇప్పటికే చాలా ఆలస్యమై పోయింది. వాళ్లు ఈ రోజే డిన్నర్ అరెంజ్ చేస్తున్నారు. త్వరగా బయలుదేరండి'' అన్నాడుకేశవరావు.

''అలాగే సార్! మా గుర్నాథం రాగానే బయల్దేరుదాం'' అన్నాడు సురేందర్.

కేశవరావుకు నలభై అయిదేళ్లుంటాయి. ఎప్పుడూ కోర్టు వ్యవహారాలలో తలమునకలుగా ఉండే అతనికి పెళ్లిళ్లకు వెళ్లడానికి కావలసిన తీరిక దొరకదు. కాని ఈ పెళ్లికి రావడం ఆయనకు తప్పనిసరైంది. ఇది తను కుదిరించిన పెళ్లి. తను అబ్బాయి మంచివాడని, అతడు చేస్తున్న ఉద్యోగం మంచిదని చెప్పడం వల్లనే రాఘవయ్య వాళ్లమ్మాయిని సురేందర్ కివ్వడానికి ఒప్పుకున్నాడు. తనీ పెళ్లికి వెళ్లకపోతే తనంటే ఎంత గౌరవం చూపించే రాఘవయ్య గారు తనను అపార్థం చేసుకుంటాడని కేశవరావు సతీసమేతంగా ఈ పెళ్లికి బయల్దేరారు.

బస్సు హైదరాబాద్ సిటీ సరిహద్దుల్ని దాటి వేగాన్ని పుంజుకుంటుండగా చీకటి పడింది.

పెళ్లికొడుకు కొలీగ్స్ అయిదుగురూ తమలో తాము జోక్స్ చెప్పుకుంటూ విరగబడి నవ్వసాగారు.

ఆ అయిదుగుర్లో ఒక్క గుర్నాథం తప్ప మిగతా వాళ్లంతా చాలా పెద్ద ఆకారాలు

లిగినవాళ్ళే. కిశోర్‌కుమార్ అందర్లోకీ ఎత్తుగా వుంటాడు. సఫారీ సూటు వేసుకుని పెద్ద ఆఫీసర్‌లా కనిపించాడు. కిశోర్‌కుమార్ మాట్లాడడం కంటే ఎక్కువగా నవ్వుతాడు. ప్రతి విషయానికీ పెద్దగా నవ్వడం అతనికలవాటు. హమీద్ నల్లగా లావుగా వుంటాడు. జీన్స్ వేసుకున్నాడు. అందరికీ సర్దార్జీ జోక్స్ చెప్పి నవ్వించడం అతనికి చాలా ఇష్టం. సూర్యనారాయణ కూడా గడ్డం పెంచాడు. తెల్లగా నిగనిగలాడే శరీరం. పాంటు షర్టు వేసుకుని టక్ చేశాడు. చూడగానే ఎంతో సంస్కారవంతుడిలా కనిపిస్తాడు. బూతు జోక్స్ అంటే చెవికోసుకుంటాడు. మధుసూదనరెడ్డి కూడా గడ్డం పెంచాడు. భారీ శరీరం. అందువల్ల ఆరడుగుల ఎత్తున్నా అంత ఎత్తున్న మనిషిలా కనిపించడు. అతని కళ్ళెప్పుడూ ఎఱ్ఱజీరలతో చాలా భయంకరంగా వుంటాయి. విస్కీ అయినా రమ్ అయినా దేనితోనూ మిక్స్ చేయకుండా నీట్‌గా తాగడం అతనికిష్టం. ఖద్దరు పైజమా వేసుకుంటాడు. చాలా సూటిగా, నిశితంగా చూస్తే పిల్లికళ్ళలా వుండే అతని కళ్ళు ఎదుటి వ్యక్తిని భయపెడతాయి. ఛామనఛాయ, ఉంగరాల జుట్టు తన చుట్టూ ఉన్న వాళ్ళంతా ఒక్క క్షణం ఊరుకోకుండా ఏదో మాట్లాడేస్తూ నవ్వుతుంటే గుర్నాథం మాత్రం కళ్ళు మూసుకుని నిద్రపోవడానికి ప్రయత్నిస్తున్నవాడిలా కనిపించాడు.

''ఏమిటండీ వాళ్ళ అల్లరి బస్సు టాప్ లేపేసేలా ఉన్నారు'' అంది కేశవరావు పక్కన కూర్చున్న అతని భార్య రాధ.

''అందరూ యువకులు. ఫ్రెండ్ పెళ్ళికొస్తున్నారు. కాబట్టి ఎంత అల్లరి చేస్తే వాళ్ళకంత ఆనందం'' అన్నాడు కేశవరావు.

''వాళ్ళ ఆనందం మన తలల్ని పగలగొడ్తోంది ఇప్పుడే ఆరుదాటుతోంది. ఆ ఊరికి వెళ్ళేటప్పటికీ యే అర్ధరాత్రవుతుందో.... రఘురామయ్య గారు , నేను పెళ్ళికొడుకు కోసం కారు పంపిస్తాను. మీరిద్దరూ ఆ కార్లోనే రండి అని మరీ చెప్పి వెళ్ళారు. పెళ్ళికొడుకు గారేమో మనల్నీ బస్సెక్కించాడు. కారులో అనుకొని రావడానికి వప్పుకున్నాను గాని, బస్సులో అని తెలిస్తే అసలు వచ్చేదాన్నే కాదు'' అంది రాధ.

''యేం చేస్తాం చెప్పు? మనం వచ్చేటప్పటికి కారు నిండా పెళ్ళికొడుకు వాళ్ళ బంధువులెక్కి కూర్చున్నారు. వాళ్ళను దింపి మనం కూర్చోవడం ఏం బావుంటుంది చెప్పు'' అన్నాడు కేశవరావు.

''మీకన్నీ మొహమాటాలే!'' అంది రాధ.

ముందు పెళ్ళికొడుకు కారు ....వెనుక బస్సు ....నార్కెట్‌పల్లి చేరగానే యేడున్నర అయింది.

నార్కెట్‌పల్లి బస్సు స్టేషన్‌లో బస్సాపి టీ తాగొస్తానని డ్రైవరు బస్సు దిగి వెళ్ళిపోయాడు. పెళ్ళికొడుకు కారుమాత్రం ఆగకుండానే వెళ్ళిపోయింది.

డ్రైవరు దిగగానే మిగతా అందరూ బస్సు దిగి పక్కనే ఉన్న హోటల్లో జొరబడ్డారు.

''పెళ్లికొడుకుగాడలా వెళ్లిపోతున్నాడేమిటి? మనకిప్పుడు కాఫీ టిఫిన్లూ చూసే దిక్కేది?'' అన్నాడు సూర్యనారాయణ.

''వాడికి కారెక్కగానే కొంచెం పొగరు కూడా ఎక్కినట్టుంది. లేకపోతే మనల్నిలా వదిలేసి వెళ్లిపోవటమేమిటి?'' అన్నాడు గుర్నాథం.

''లక్షాధికారి అల్లుడు కాబోతున్నాడు.... ఆ మాత్రం పొగరెక్కకుండా వుంటుందా?'' అన్నాడు రెడ్డి.

''ఈ పెళ్లి కుదిరించిన పెళ్లిపెద్ద ఆ అడ్వకేటునుఅడుగుదాం పదండి'' అన్నాడు గుర్నాథం.

వాళ్లు ఐదుగురూ అప్పుడేబస్సు దిగుతున్న కేశవరావు దగ్గరకొచ్చారు.

''యేంసార్? పెళ్లికొడుకు మీకేమన్నా చెప్పాడా?'' అన్నాడు గుర్నాథం.

''యే విషయం గురించి?'' అడిగాడు కేశవరావు.

''వాడలా వెళ్లిపోతే ఇప్పుడు మమ్మల్ని చూసేవాళ్లెవరు?'' అన్నాడు గుర్నాథం.

''మిమ్మల్ని చూసేదేమిటి?'' అన్నాడు అక్కడే వున్న పెళ్లికొడుకు కజిన్ రాజేందర్.

''మాకిప్పుడు కాఫీలు, టిఫిన్లు ఎవరు అరెంజ్ చేస్తారు?'' అన్నాడు సూర్యనారాయణ.

''ఎవరు అరెంజ్ చేసేదేమిటి? మీ దగ్గర కనీసం కాఫీ తాగడానికి కావలసిన డబ్బులు కూడా లేవా?'' అన్నాడు రాజేందర్.

''పెళ్లికొచ్చి మమ్మల్ని ఖర్చు పెట్టుకోమంటాడు? ఎవడ్రా వీడు?'' అన్నాడు గుర్నాథం తన ఫ్రెండ్స్ వైపు తిరిగి.

''ఏయ్ మిస్టర్? కాస్త మర్యాదగా మాట్లాడు....'' అన్నాడు రాజేందర్.

''ఆహా! పల్లెటూరి బైతు మనకు మర్యాద నేర్పిస్తున్నాడ్రోయ్!'' అన్నాడు కిశోర్‌కుమార్ రాజేందర్‌ను చూస్తూ.

రాజేందర్ ధోవతి కట్టుకుని లాల్చీ వేసుకున్నాడు.

''ఎవడ్రా పల్లెటూరి బైతు? పిచ్చి పిచ్చిగా మాట్లాడారంటే పట్టుకుని తంతాను'' అన్నాడు రాజేందర్ కిశోర్‌కుమార్ కేసి ఉరిమి చూస్తూ.

''నువ్వు...మమ్మల్ని తంతావా? ఎన్ని గుండెలురా నీకు?'' అంటూనే కిశోర్‌కుమార్ వచ్చి రాజేందర్ కాలర్ పట్టుకున్నాడు.

అంతే,, మరుక్షణంలో వాళ్లు ఐదుగురూ ఒకవైపు, రాజేందర్, అతని బంధువులు మరొకవైపు ఒకర్నొకరు తిట్టుకోవడం, తోసుకోవడం మొదలుపెట్టారు.

''ఇంత చిన్న విషయానికిలా పోట్లాడుకోవడమేమిటి? ''ఊరుకోండి...'' అరిచినట్టుగా అన్నాడు కేశవరావు.

వాళ్లు ఐదుగురూ ఆ గుంపులోంచి బయటికొచ్చి హోటలు లోకి వెళ్లారు.

''వీళ్లు మరీ అతిగా ప్రవర్తిస్తున్నారండి...వీళ్ల కారణంగానే ఇంత లేటయిపోయింది. లేకపోతే ఈపాటికి మనం పెళ్లికూతురు ఊరు చేరుకునేవాళ్లం. వీళ్లకు దారిపొడుగునా మర్యాదలు చేస్తూ పెళ్లికొడుకు కూడా వీళ్లతోటే ఉండిపోవాలట!'' అన్నాడు రాజేందర్.

''మనం వాళ్ల ఊరు చేరేటప్పటికి డిన్నర్ గిన్నర్ అంతా అయిపోతుంది. మనకు చివరి మెతుకులు కూడా దొరకవు'' అన్నాడు ఉపేందర్ - పెళ్లికొడుకు మరో కజిన్.

డ్రైవరు వచ్చి పెద్దగా హారన్ మ్రోగించాక ఒకరి తర్వాత ఒకరొచ్చి బస్సెక్కారు.

బస్సు మళ్లీ స్టార్టయ్యేటప్పటికి ఎనిమిదయింది.

''యేమండి! ఆ ఐదుగుర్ని చూస్తే నా కెందుకో భయమేస్తోందండీ!'' అంది రాధ కేశవరావు చెవిలో గుసగుసగా.

''ఎందుకు?'' అన్నాడు కేశవరావు.

''వాళ్ల మాటలు...వాళ్ల నవ్వులు...వాళ్ల ఆకారాలు....'' అంది రాధ.

''బయటి ప్రపంచంతో ఎక్కువ సంబంధం లేకపోవడం వల్ల నువ్వలా మాట్లాడుతున్నావు. వాళ్ల వేషం, వాళ్ల మాటలు, వాళ్ల ఆకారాలు అన్నీ మామూలుగానే ఉన్నాయి. వాళ్లంతా ఒక ఆఫీసులో పనిచేస్తున్న ఉద్యోగస్తులు. ఎంతో బాధ్యత కల్గినవాళ్లు. పెళ్లి అనేటప్పటికి వాళ్లంతా చాలా రిలాక్స్‌డ్‌గా మారిపోయి అలా ఆడడం, పాడడం చేస్తున్నారు. దాన్ని పెద్దగా పట్టించుకోకు'' అన్నాడు కేశవరావు.

''యేమోనండి బాబూ! యేం పెళ్లో ఏమిటో...బాగా చలేస్తోంది. యేడింటి వరకే చేరుకుంటామని తీసుకొచ్చారు. ఇంకా సగం కూడా రాలేదు'' అంది రాధ.

రాధ అలా అంటుండగా వేగంగా వెడుతున్న బస్సు స్లో అయిపోయి ఆగిపోయింది.

అందరూ 'బస్సు మళ్లీ ఎందుకాగిందని' తమలో తాము ప్రశ్నించుకోసాగారు.

బస్సు ఆగినచోట రోడ్డు మీద ట్యూబు లైట్లు వెలుగుతున్నాయి. పక్కనే చిన్న ఊరుంది. డ్రైవరు కిందకు దిగి ఇంజన్ కింది భాగాన్ని పరీక్షించసాగాడు.

'యేమైంది?' అంటూ గుర్నాథం కూడా కిందకు దిగాడు.

'ఆయిల్ లీకౌతోంది...' అన్నాడు డ్రైవరు.

బొట్లు బొట్లుగా ఆయిల్ ఇంజన్ లోంచి కారుతోంది.

''ఎలా ఇప్పుడు?'' అన్నాడు గుర్నాథం.

''ఆయిల్ కారకుండా చెయ్యాలి'' అంటూ డ్రైవరు బస్సులోపలికొచ్చి ఇంజన్ మీది బోనెట్ తెరిచి, యేవో కొన్ని స్క్రూలు బిగించడం మొదలుపెట్టాడు. బస్సులో కూర్చున్న వారంతా ఉసూరుమంటూ బస్సు దిగి కారుతున్న ఆయిల్‌ను చూడసాగారు.

''ఇంత మాత్రానికే బస్సాపుతావా? నల్గొండ దాకా ఈజీగా వెళ్లవచ్చు. అక్కడ బాగుచెయ్యచ్చు'' అన్నాడు రెడ్డి.

డ్రైవరు ఎవరి మాటలు వినిపించుకోకుండా తన పని తను చేసుకోసాగాడు. కాని అతడు స్క్రూలు బిగిస్తున్నకొద్దీ ఆయిల్ కారడం తక్కువ కాకపోగా ఇంకా ఎక్కువ కాసాగింది. బొట్లు బొట్లుగా కాకుండా ఆయిల్ ధారగా ప్రవహించసాగింది.

ఒక అరగంట సేపు తంటాలు పడి ఇక లాభం లేదని డ్రైవరు నార్కెట్‌పల్లి వైపు వెడుతున్న ఒక లారీని ఆపి మెకానిక్‌ను తీసుకొస్తానని చెప్పి వెళ్లిపోయాడు. డ్రైవరు అలా వెళ్లిపోవడంతో బస్సులో ఉన్నవాళ్లంతా హాహాకారాలు చేశారు.

''ఇదేం కర్మండీ.....నేను బస్సులో రాను మొర్రో అంటే తీసుకొచ్చి ఈ అడవిలో పడేసి చంపుతున్నారు. హైదరాబాద్ వైపు వెళ్లే బస్సేదన్నా వస్తే ఆపండి. వెళ్లిపోదాం'' అంది రాధ.

''ఇప్పుడు హైదరాబాద్ వెళ్లడం యేం బావుంటుంది. మిర్యాలగూడెం వైపు వెళ్లే బస్సేదైనా వస్తే వెడదాం'' అంటూ కేశవరావు బస్సు దిగి రోడ్డు మీద నిల్చున్నాడు. అప్పటికే బస్సులోని చాలా మంది కిందకు దిగి 'యేం చేద్దామా' అని ఆలోచించసాగారు. వాళ్లు ఐదుగురూ కూడా బస్సు దిగి కొంచెం దూరంగా వున్న కాఫీ హోటలువైపు నడువసాగారు.

''మనం సూరిగాడితో పాటు వెళ్లకుండా ఈ బస్సు ఎక్కడం చాలా పొరపాటయింది'' అన్నాడు గుర్నాథం.

''అసలు మనం యేమైపోతున్నామో చూడకుండా వాడలా కార్లో ఉడాయించేస్తాడా... మనం వెళ్లకుండా వాడు పెళ్లెలా చేసుకుంటాడో చూస్తాను''

పళ్లు కొరుకుతూ అన్నాడు సూర్యనారాయణ.

''భేషుగ్గా చేసుకుంటాడు... ఈ బస్సూ, మనమూ తగలబడిపోయినా సరే వాడి పెళ్లిక ఆగదు'' అన్నాడు కిశోర్.

''ఎలా ఆగదో చూస్తాను'' అన్నాడు సూర్యనారాయణ.

''బాగా చలేస్తోంది. అదిగో గవర్నమెంట్ వారి సారాయి కొట్టు. ఓ రెండు వందలు పుచ్చుకుంటే గాని ఈ చలి పోయేటట్టు లేదు'' అన్నాడు రెడ్డి సారాయి కొట్టు వైపు దారితీస్తూ. ''ఈ రాత్రి వాటిసిక్స్టీ నైన్ లో ఈదుతామని కలలు గంటే నాటు సారాయితో సరిపుచ్చుకోవడమా? హతవిధీ! ఎంత అధోగతి....'' అన్నాడు సూర్యనారాయణ.

''ఈ చలి నుండి తప్పించుకోవాలంటే ఎలాగో అడ్డస్టయిపోక తప్పదు. పదండి. ఇక్కడెంత బిల్లయిందో అంతకు డబుల్ సూరిగాడి దగ్గర్నుండి వసూలు చెయ్యాలి'' అన్నాడు గుర్నాథం.

అప్పటికే బస్సులోని చాలా మంది సారాయి కొట్టు దగ్గరకు చేరుకున్నారు. వాళ్లు

ఐదుగురు ఒకవైపు, రాజేందర్, ఉపేందర్ మొదలైన పెళ్లికొడుకు తరఫు బంధువులు ఒకవైపు - రెండు వర్గాల మధ్య మరోసారి ఘర్షణ యే క్షణంలోనైనా ప్రారంభం కావచ్చుననిపించింది..

ఇదంతా గమనిస్తున్న కేశవరావుకు ఆ ప్రమాదం లోంచి ఎలా బయటపడాలో అర్థం కాలేదు.

కొంచెం దూరం లోంచి ఆర్టీసి బస్సొకటి వస్తున్నట్టుగా కనిపించడంతో కేశవరావు ఆ బస్సును ఆపమన్నట్టుగా చెయ్యూపాడు. 'మిర్యాలగూడ' అన్న బోర్డున్న ఆ బస్సు ఆగటంతో కేశవరావు 'రాధా' అని కేకేశాడు. రాధ వెంటనే సూట్‌కేసు పట్టుకొని బస్సు దిగి కిందకొచ్చేసింది. వాళ్లిద్దరూ ఆ బస్సెక్కాశారు.

వాళ్లిద్దరూ అలా వెళ్లిపోయాక, మనం కూడా ఆ బస్సులో వెళ్లిపోవాల్సింది' అన్న ఐడియా పెళ్లికొడుకు తరఫు బంధువుల్లో కొందరికి కల్గింది.

కేశవరావు, రాధ ఎక్కిన బస్సు మిర్యాలగూడ చేరేటప్పటికి పదకొండయింది. అక్కడి నుంచి పెళ్లికూతురు వాళ్ల ఊరుకెళ్లే బస్సేదైనా ఉందేమోనని కనుక్కుంటే లాస్ట్ బస్సు ఎనిమిదింటికే వెళ్లిపోయిందని, కావాలంటే ఆటోవాళ్లు వస్తారని చెప్పారు. ఇరవై రూపాయలకు ఆటో మాట్లాడుకుని వాళ్లిద్దరూ పెళ్లికూతురువాళ్ల ఊరు చేరేసరికి పన్నెండుదాటింది.

కేశవరావు వెంటనే పెళ్లికొడుకు దిగిన విడిదిలోకెళ్లి ''నార్కట్‌పల్లి - నల్లగొండ బస్సు మధ్యలో ఫెయిలయింది. వెంటనే మీ మామగారితో మాట్లాడి వాళ్లకేదైనా వెహికిల్ పంపించు'' అన్నాడు.

''మీరెలా వచ్చారు సార్'' అన్నాడు సురేందర్.

''నానా తంటాలుపడి ఓ యాభై రూపాయలు తగలేసి ఎలాగో చేరానులే...'' అన్నాడు కేశవరావు.

''సారీ సార్! మిమ్మల్ని కార్లో తీసుకురాకపోవడం చాలా పొరపాటైపోయింది....'' అన్నాడు సురేందర్.

''నా సంగతి పోనీయ్... ముందు రోడ్డు మీద అర్ధరాత్రి చలిలో చిక్కుకుపోయి నానా అవస్థలు పడుతున్న వాళ్ల సంగతి చూడు'' అన్నాడు కేశవరావు.

మధ్యలో బస్సు ఫెయిలయిందని, యేదన్నా వెహికిల్ పంపించడానికి వీలౌతుందేమో చూడండని కేశవరావు రాఘవయ్యతో కూడా చెప్పాడు.

''అంతమందిని తీసుకురావడానికి ఈ పల్లెటూర్లో ఈ అర్ధరాత్రి వేరే వెహికిల్ యేం దొరుకుతుందండి. అసలు మిమ్మల్ని కార్లో రమ్మన్నాను గదా! బస్సులో ఎందుకొచ్చారు?'' అన్నాడు రాఘవయ్య.

''నా సంగతి వదిలెయ్యండి బాబూ! వాళ్ల సంగతి చూడండి'' అన్నాడు కేశవరావు.

''సరే - యేదో చేద్దాం లెండి. మొదట మీరు భోజనం చేసి కాస్త రెస్టు తీసుకోండి'' అంటూ రాఘవయ్య వెళ్లిపోయాడు.

''పెళ్లికొడుకైతే వచ్చేశాడు... ఇక పెళ్లి మాత్రం ఆగదు.... తెల్లారేటప్పటికి బస్సును బాగుచేసుకుని వాళ్లే వస్తార్లే...'' అన్నాడు పెళ్లికూతురు మేనమామ వెంకట్రామయ్య.

* * *

నార్కట్‌పల్లి వెళ్లిన డ్రైవర్ మెకానిక్‌ను తీసుకొని మళ్లీ బస్సు దగ్గరకు రావడానికి రెండు గంటలు పట్టింది. వాళ్లిద్దరూ కలిసి లీకవుతున్న ఆయిల్‌ను ఆపటానికి మరో గంటన్నర పట్టింది. బస్సు మళ్లీ స్టార్టయ్యేటప్పటికి పన్నెండయ్యింది.

బస్సు స్టార్ట్ కావడం ఆలస్యమవుతున్న కొద్దీ వాళ్లు ఐదుగురికీ కోపం ఎక్కువ కాసాగింది.

''సూరిగాడిలా మనల్ని వదిలేసి వెళ్లిపోతాడా? వాడిప్పుడు కనబడాలేగాని చీల్చిపారేస్తాను'' అన్నాడు సూర్యనారాయణ.

''ఈ పెళ్లి కుదిర్చిన ఆ వకీలుగాడు... వాడు కూడా వెళ్లిపోయాట్ట...'' అన్నాడు కిశోర్‌కుమార్.

''వాడెలా వెళ్లాడు?'' అన్నాడు గుర్నాథం.

''మిర్యాలగూడ వెళ్తున్న బస్సేదో ఆగిందట... దాంట్లో వెళ్లాడుట'' అన్నాడు కిశోర్.

''అయితే వాడీపాటికి ఆ ఊరు చేరే వుంటాడు... మన కోసం తప్పకుండా యేదన్నా వెహికల్ వస్తుంది'' అన్నాడు గుర్నాథం.

''వాడెళ్లి ఇక్కడ బస్సు ఫెయిలయిన విషయం చెబుతాడో లేక హాయిగా పెళ్ళాం పక్కలో పడుకుంటాడో'' అన్నాడు సూర్యనారాయణ.

''యేమిటా మాటలు... కాస్త మర్యాదగా, మనుషుల్లా మాట్లాడండి'' అన్నాడు రాజేందర్.

''యేమిట్రా మర్యాద! హాయిగా సిటీలో వుండే మమ్మల్ని తీసుకువచ్చి ఈ అడవిలో పడేసి వాడు హాయిగా పెళ్లాన్ని తీసుకుని వెళ్లిపోతాడా!'' అన్నాడు గుర్నాథం.

అంతే... వాళ్ల ఐదుగురు... రాజేందర్ బంధువులు ఒకర్నొకరు తిట్టుకోవడం మొదలెట్టారు. ఆ ఘర్షణ తారాస్థాయికి చేరుకుంటుండగా బస్సు స్టార్ట్ కావడంతో అందరూ హడావుడిగా బస్సెక్కారు.

బస్సు మిర్యాలగూడ చేరేటప్పటికి రెండున్నరయింది. డ్రైవర్ బస్సును డిపో లోపలికి తీసుకెళ్లి మరోసారి చెక్ చేయించుకుని, ఆయిల్‌ని నింపుకుని బయల్దేరటానికి గంటకు పైనే

పట్టింది. బస్సులో చాలామంది నిద్రపోయారు.

బస్సు పెళ్లికూతురు వాళ్ల ఊరు చేరేటప్పటికి ఐదున్నరయింది.

ఊరి బయటే రాఘవయ్యగారి మనుషులు బస్సుకు ఎదురుగా వచ్చి అందర్నీ విడిదికి రమ్మని ఆహ్వానించారు.

అందరికన్నా మొదలు వాళ్లు ఐదుగురూ బస్సు దిగారు. కోపంతో ఆగ్రహోదగ్రులై పోతున్న వాళ్ల ముందు రాఘవయ్యగారి మనుషులు మాడి మసైపోతారేమోననిపించింది.

''మొట్టమొదట మాకు మా సూరిగాడెక్కడున్నాడో చూపించండి'' అన్నాడు గుర్నాథం అక్కడున్న పెళ్లికూతురు మేనమామ వెంకట్రామయ్య కాలర్ పట్టుకొని.

''ఇదేమిటండి...నన్ను కొడతారా యేమిటి?'' అన్నాడు వణికిపోతూ వెంకట్రామయ్య.

''కొడతామా! చంపుతామా? వాడేడి... పెళ్లికొడుకెక్కడ? వాడి మామగాడెక్కడ.... ఒక్కొక్కర్నీ కాల్చి పారేస్తాము'' అన్నాడు సూర్యనారాయణ.

''ఎందుకండీ... మేమేం పాపం చేశాం...'' అన్నాడు వెంకట్రామయ్య.

''రాత్రంతా మమ్మల్ని చలిలో ఆకలితో చంపి మీరేమో ఇక్కడ హాయిగా మెక్కి...'' గుర్నాథం.

''బస్సు ఫెయిలయిందని మాకేం తెలుసండి'' అన్నాడు వెంకట్రామయ్య.

''మీకేం తెలుసా? ఆ అడ్వకేట్‌గాడు చెప్పలేదా? మమ్మల్నిలా గాలిలో వదిలేసి వాడొచ్చాడుగా... వాడు చెప్పలేదా?'' అన్నాడు గుర్నాథం.

''చెప్పాడనుకోండి... చెబితే మాత్రం మేం ఏం చెయ్యగలం? ఎందుకలా రెచ్చిపోతున్నారు...'' అన్నాడు అక్కడకు పరుగెత్తుకొని వచ్చిన రాఘవయ్య తమ్ముడు మాధవయ్య.

''ఏం చెయ్యగలరా? మా కోసం మరో వెహికల్ పంపించాలన్న బుద్ధి లేదూ! మీరసలు మనుష్యులేనా?'' అన్నాడు సూర్యనారాయణ.

''ఈ పల్లెటూర్లో మరో వెహికల్ ఎక్కడుంటుందండి?'' అన్నాడు మాధవయ్య.

''కారుందిగా... వాడు పెళ్లికొడుకు గాడొచ్చిన కారుందిగా'' అన్నాడు గుర్నాథం.

''అది అద్దె కారు... అంత రాత్రి డ్రైవర్ రావడానికి ఒప్పుకోలేదు... ఒకవేళ అతడు ఒప్పుకున్నా ఆ కార్లో ఎంతమంది పడ్తారు? బస్సెడు జనాన్ని కారెలా తీసుకొస్తుంది?'' అన్నాడు రాఘవయ్య.

''ఆ కారును కనీసం మా కోసం... మా ఐదుగురి కోసం పంపించొచ్చుగా! మిమ్మల్ని యే ఇబ్బంది లేకుండా తీసికెళ్తానన్న వాడి మాట నమ్మి మేం బయల్దేరాం... ఏడసలు? వాడెక్కడ... పెళ్లికొడుకు నాకొడుకెక్కడ?'' అన్నాడు గుర్నాథం.

''అవతల ముహూర్తానికి వేళవుతోంది. మొదలు పెళ్లయిపోనీయండి. తర్వాత అన్ని

విషయాలు మాట్లాడుకుందాం. మొదలు మీరంతా విడిదికి రండి... అక్కడ మీకు అన్ని యేర్పాట్లు చేశాం'' అన్నాడు మాధవయ్య.

''మొదట పెళ్లయిపోవాలా? వరేయ్ రండిరా! వాడి పెళ్లి మొదట మనమే చెయ్యాలి... ఆ తర్వాతే మీరు చెయ్యాలి'' అంటూ గుర్నాథం ముందుకు కదిలాడు. అతని వెనకే మిగతా నల్గురూ బయల్దేరారు.

బస్సు దిగిన మిగతా వాళ్లంతా విడికి బయల్దేరారు.

కొంచెం దూరంలో బాండ్ చప్పుడు వినిపిస్తోంది. వాళ్లు ఐదుగురు కదం తొక్కుతున్న సైనికుల్లా కొంచెం ముందుకు నడవగానే వాళ్లకు పెళ్లి పందిరి కనిపించింది. అక్కడే పెళ్లికొడుకును తీసుకువచ్చిన కారు కూడా కన్పించింది.

''ఐడియారా రెడ్డి! నీకు డ్రైవింగ్ వచ్చుకదా! నువ్వెళ్లి ఆ కార్లో స్టీరింగ్ దగ్గర కూర్చొని రెడీగా వుండు. మేం వెళ్లి వాడ్ని పట్టుకొస్తాం...'' అన్నాడు గుర్నాథం.

''అలాగే''నంటూ రెడ్డి కార్లో దూరాడు.

అందరితోపాటు పెళ్లి చూస్తున్న కారు డ్రైవర్ అది గమనించలేదు.

గుర్నాథం, హమీద్, కిశోర్‌కుమార్, సూర్యనారాయణ తోకతొక్కిన తాచుల్లా బుసకొడ్తూ పెళ్లి పందిట్లో ప్రవేశించారు.

పెళ్లికొడుకును పెళ్లి పందిట్లో కూర్చొబెట్టి పురోహితుడు ఏదో మంత్రం చదువుతున్నాడు. రాఘవయ్య, అతని భార్య అన్నపూర్ణమ్మ పెళ్లికొడుకు కాళ్లు కడుగుతున్నారు.

''వరేయ్ సూరీ! ఇట్రారా'' గర్జించినట్టుగా అన్నాడు గుర్నాథం. పెళ్లి పందిట్లో కూర్చున్న బంధువులు, ఆ ఊరి పెద్దలూ అందరూ ఉలిక్కిపడి గుర్నాథం కేసి చూశారు.

''గురూ! కిశోర్... సూరీ... మీరంతా ఎప్పుడొచ్చారు?'' అన్నాడు సురేందర్ దిగ్గున లేచి నిల్చొని.

''నువ్వు మొదట లేచి ఇట్రా'' మరోసారి గర్జించాడు గుర్నాథం.

''మొదలీ కార్యక్రమం అయిపోనీయండిరా... తర్వాత మీకు కావలసిన యేర్పాట్లన్నీ చూస్తాను'' బ్రతిమాలుతున్నట్టుగా అన్నాడు సురేందర్.

''మొదలొకసారి ఇటొచ్చి వెళ్తావా? లేక...''

గుర్నాథం కంఠంలో ధ్వనించిన కర్కశత్వంతో హడలిపోయిన పెళ్లికొడుకు వెంటనే లేచి వాళ్ల మధ్యలోకెళ్లాడు.

కిశోర్, హమీద్ ఒక చెయ్యి, గుర్నాథం, సూర్యనారాయణ ఒక చెయ్యి పట్టుకొని సురేందర్‌ను గబగబా కారు దగ్గరకు ఈడ్చుకుపోయి అతన్ని కార్లోకి తోసేశారు.

''వరేయ్ రెడ్డీ... పోనీయ్‌రా...'' అన్నాడు గుర్నాథం.

అంతా కన్నుమూసి తెరిచేలోగా జరిగిపోయింది. అసలేం జరుగుతున్నదో అక్కడ

కూర్చున్న వాళ్లెవరికీ అర్థం కాలేదు.

కారు స్టార్టయి కొంచెం ముందుకు కదలగానే రాఘవయ్య, వెంకట్రామయ్య మొదలైన వాళ్ళు కారుకడ్డంగా పరిగెత్తుకొని వచ్చారు.

''ఆపండి... కారాపండి...'' పెద్దగా అరిచాడు రాఘవయ్య.

''యేమిటీ అఘాయిత్యం! పెళ్లి కొడుకు నెక్కడికి తీసుకెళ్తున్నారు?'' అన్నాడు వెంకట్రామయ్య.

''వరేయ్ రెడ్డి! వాళ్లు చచ్చినా ఫరవాలేదు. కానీ కారాపావంటే నిన్ను చంపేస్తాను...'' అరిచాడు గుర్నాథం.

యేం చెయ్యాలా అని రెడ్డి ఆలోచిస్తుండగానే రాఘవయ్య తరఫు బంధువులందరూ వచ్చి కారుకడ్డంగా నిల్చున్నారు.

''మీరేం చెయ్యదల్చుకున్నారిప్పుడు?'' అన్నాడు రాఘవయ్య.

''వీడ్ని తీసుకొని మేం హైదరాబాద్ వెళ్లిపోతాం. నువ్వూ, నీ కూతురూ కలిసి యే బాయిలోనన్నా పడి చావండి'' అన్నాడు గుర్నాథం.

''ఎందుకు మీరంత అఘాయిత్యానికి పాల్పడుతున్నారు?'' అన్నాడు రాఘవయ్య.

''ఎందుకా? మమ్మల్ని పెళ్లికి రమ్మన్న వీడు మేం చచ్చామో, బ్రతికామో చూడకుండా కార్లో ఎప్పుడు పెళ్లికూతురు పక్కలో పడుకుందామా అని పరుగెత్తుకొని వస్తాడా?'' అన్నాడు గుర్నాథం.

''బస్సు ఫెయిలౌతుందని అతనికేం తెలుసండీ'' అన్నాడు రాఘవయ్య.

''తెలీదా? ఆ అడ్వొకేట్‌గాడు చెప్పలేదా?'' అన్నాడు గుర్నాథం.

''మర్యాదగా మాట్లాడండి. ఆ అడ్వొకేట్‌గార్ని యేమన్నా అన్నారంటే మీ ఐదుగుర్నీ ఇక్కడే పాతేస్తాం'' అన్నాడు రాఘవయ్య పెద్దకొడుకు శ్రీధర్.

''నువ్వూరుకోరా శ్రీధర్! ఈ పల్లెటూర్లో వేరే వెహికల్ దొరక్కపోవడం వల్లనే పంపించలేకపోయాం. దయచేసి పెళ్ళి కొడుకును వదిలిపెట్టండి... అవతల ముహూర్తం టైమ్ మించిపోతోంది'' అన్నాడు రాఘవయ్య.

''వదిలిపెట్టం. పెళ్లికొడుకొచ్చాడు గదా... వీవరు రాకపోతే యేంలే అన్న నిర్లక్ష్యం వల్లనే నువ్వు మా కోసం వెహికల్ పంపించలేదు. ఆఫ్టరాల్ ఆడపిల్ల తండ్రివి నీకింత పొగరా... నీ పొగరెలా అణచాలో మాకు తెలుసు... పక్కకు తప్పుకుంటావా? లేక నీ శవం మీదినించి కారును పోనివ్వమంటావా?'' అన్నాడు గుర్నాథం.

ఇంతలో అక్కడికి పెళ్లికూతురు తాతగారొచ్చారు.

''అయ్యా! జరిగిందేదో జరిగిపోయింది. ఆడపిల్ల తరఫువాళ్లం తప్పు మాదే - ఒప్పుకుంటున్నాము. ఎప్పుడు మమ్మల్ని యేం చెయ్యమంటే అది చేస్తాం. మీ కాళ్ళు

పట్టుకొమ్మంటే పట్టుకుంటాను. కాని, మా అమ్మాయి పెళ్లిని మాత్రం ఆపకండి. మేం చేసిన తప్పుకు మా అమ్మాయిని శిక్షించకండి. మేం చేసిన తప్పుకు మీరు మాకు యే శిక్ష విధించినా ఫరవాలేదు. కానీ మా అమ్మాయి జీవితాన్ని మాత్రం నాశనం చేయకండి'' అంటూ చేతులు జోడించి ప్రార్థించాడా వృద్ధుడు.

రాఘవయ్య కూడా చేతులు జోడించాడు.

''మీకేం కావాలంటే అది తెచ్చిపెడ్తాం... మీకిప్పుడే ఓ పెద్ద పార్టీ అరేంజ్ చేస్తాం. దయచేసి పెళ్లికొడుకును వదిలెయ్యండి'' అన్నాడు రాఘవయ్య.

అలా రారా దారికి... వరేయ్ సూరిగా! నీ పెళ్లయ్యేలోగా మాక్కావలసినవన్నీ రెడీ కావాలి. మాకేం కావాలో నీకు తెలుసుగా. మేమిలా చేశామని మీ మామగారి తరఫు బంధువులెవరన్నా మమ్మల్నేమన్నా అన్నారో పరిణామాలు చాలా తీవ్రంగా వుంటాయి'' అన్నాడు గుర్నాధం.

''నీకు దండం పెడ్తారా గురూ! తప్పయిపోయింది క్షమించు. ఈ క్షణం నుండి మిమ్మల్ని విఐపిల్లా చూస్తారు. మీకేం కావాలంటే అది క్షణాలమీదొస్తుంది. దయచేసి నన్ను వదిలెయ్యండి'' అన్నాడు సురేందర్ రెండు చేతులూ జోడించి.

వాళ్లు సురేందర్‌ను వదిలేశారు. సురేందర్‌తో పాటు అందరూ కారు దిగారు. వెంటనే కారు డ్రైవర్ వచ్చి ఆ కారును అక్కణ్ణించి దూరంగా తీసుకెళ్లాడు. సురేందర్ పెళ్లిపీటలమీద కూర్చోవడానికి వెళ్తూ అక్కడున్న బంధువులందర్నీ చూస్తూ ''దయచేసి మీరెవరూ వాళ్లనేమీ అనకండి. మామగారూ! వెంటనే వాళ్లను మీ బంధువు లింటికెక్కడికైనా పంపించి వాళ్లక్కావలసినవి చూడండి'' అన్నాడు.

పెళ్లికొడుకొచ్చి పెళ్లిపీటలమీద కూర్చోగానే అందరి గుండెలు కుదుటపడ్డాయి.

రాఘవయ్య తన తమ్ముడు మాధవయ్యను పిలిచి ''వాళ్లను వెంటనే మీ ఇంటికి తీసుకెళ్లి వాళ్లకేం కావాలో తెప్పించి వాళ్లు తృప్తిపడేలా చూడు'' అన్నాడు.

మాధవయ్య గుర్నాధం దగ్గరకెళ్లి ''మా ఇంటికెడదాం రండి. మీరు స్నానాలు ముగించేలోగా మీకు కావలసినవన్నీ వచ్చేస్తాయి'' అన్నాడు.

వాళ్లు ఐదుగురు బ్రీఫ్‌కేసుల్ని పట్టుకొని అక్కడికి దగ్గర్లోనే వున్న మాధవయ్య ఇంటికి వెళ్లారు.

మాధవయ్య ఇల్లు చాలా పెద్దదే. ఈ మధ్యనే కట్టించాడు. విశాలమైన గదులతో చాలా శుభ్రంగా, సుందరంగా వుందా బిల్డింగ్.

''మేం వెంటనే స్నానాలు చేయాలి. వేన్నీళ్లు పెట్టించండి'' అన్నాడు గుర్నాధం.

''వేన్నీళ్లు రెడీగా ఉన్నాయి. ఇదిగో ఈ రూమ్‌ను మీ కోసం కేటాయిస్తున్నాము. ఇంటెనుక రెండు బాత్‌రూమ్‌లున్నాయి. ఇద్దరిద్దరు ఒకేసారి స్నానాలు చెయ్యొచ్చు''

అన్నాడు మాధవయ్య.

''ఓకె..! ఓ.కె..! రూమ్ చాలా బాగుంది. ఈ పల్లెటూర్లో కూడా ఇంత మంచి బిల్డింగ్... ఇంత మంచి ఫర్నిచర్ ఉన్నాయంటే వీళ్లు బాగా ఉన్నవాళ్లే... బైదిబై... మేం స్నానాలు చేసొచ్చేంతవరకు మా సూరిగాడు పెళ్లికూతురు మెడలో తాళి కట్టడానికి వీల్లేదు...'' అన్నాడు గుర్నాథం.

''ఇప్పటికే చాలా టైమయిపోయిందండి. బాబూ! ముహూర్తం వేళ దాటి గంటయ్యింది'' అన్నాడు మాధవయ్య.

''ఎట్లాగూ ముహూర్తం వేళ దాటిపోయింది గదా! కాబట్టి మరో అరగంట ఆగితే వచ్చే నష్టమేమీ లేదు. మేం ఇంత దూరం ఇన్ని కష్టాలుపడి వచ్చిందెందుకు? వాడి పెళ్లి చూడటానికేగదా! మేం తప్పకుండా వాడి పెళ్లి చూడాలి. మీరెళ్లి చెప్పండి'' అన్నాడు సూర్యనారాయణ.

మాధవయ్య అలాగేనని వెనక్కి తిరగబోతుండగా ''మీ పేరేమిటండి?'' అన్నాడు గుర్నాథం.

''మాధవయ్య అంటారండి'' అన్నాడు మాధవయ్య.

''చూడండి మాధవయ్యగారూ! అక్కడ పెళ్లికొడుకు పెళ్లికూతురు మెడలో తాళి కట్టడం అయిపోగానే ఇక్కడ మాకు కావలసినవన్నీ రెడీగా ఉండాలి. ఒక్క క్షణం ఆలస్యమైనా మా గురూకు కోపమొస్తుంది'' అన్నాడు సూర్యనారాయణ మాధవయ్య భుజంమీద చెయ్యేసి.

''అయ్యా! మీ కోసం ఇప్పుడే ఒక మనిషిని మిర్యాలగూడకు స్కూటర్‌మీద పంపించాం. మీకు కావలసిన సరుకంతా ఇంకో అరగంటలో వచ్చేస్తుంది'' అన్నాడు మాధవయ్య.

''ఇప్పుడు మనిషిని మిర్యాలగూడ పంపించారా! ఆల్‌రెడీ తెప్పించి రాత్రినుంచి మాకోసం అనుక్షణం ఎదురుచూస్తుంటారని అనుకున్నాము. మొత్తానికి సూరిగాడంటే సూరిగాడేరా!'' అన్నాడు రెడ్డి.

''మొదట మీరెళ్లి మేమొచ్చేదాకా ఎవరూ అక్షింతలు వెయ్యడానికి వీల్లేదని చెప్పండి. వధూవరుల నెత్తిమీద మొట్టమొదట నేనే అక్షింతలు వెయ్యాలి...'' అన్నాడు గుర్నాథం.

మాధవయ్య బయటకు వెళ్తూ అక్కడున్న తన పాలేర్లతో ''వీళ్లను కాస్త జాగ్రత్తగా చూడండి. వీళ్లు చాలా అసాధ్యుల్లా ఉన్నారు'' అంటూ పెళ్లి జరుగుతున్న చోటికి పరిగెత్తాడు.

ముహూర్తం మించిపోతోందని పురోహితుడు మంత్రాలు చాలా వేగంగా చదివేస్తున్నాడు. మంగళసూత్ర ధారణ చేయించడానికి సిద్ధమవుతుండగా మాధవయ్య రొప్పుకుంటూ

వచ్చి-

''కాస్సేపాగండయ్యగారూ!'' అంటూ అరిచాడు.

''ఇంకా ఆగటమేమిటయ్యా! ఇప్పటికే గంటాలస్యం'' అన్నాడు పురోహితుడు.

''పెళ్లికొడుకుగారి ఫ్రెండ్స్ వచ్చేదాకా పెళ్లి ఆపాల్సిందేనట. లేకపోతే మరోసారి మన భరతం పట్టేస్తారట...'' అన్నాడు మాధవయ్య.

''మా గురూ అలా చెప్పాడా! అయితే వాళ్లొచ్చేదాకా ఆగాల్సిందే. లేకపోతే... ఇందాక చూశారుగా అంతకంటె పెద్ద బీభత్సాన్ని సృష్టిస్తారు'' అన్నాడు పెళ్లికొడుకు.

అందరూ ఒకరి మొహాలొకరు చూసుకున్నారు.

పెళ్లికూతురు పద్మ మొహంలో భయం ఆందోళన స్పష్టంగా కనిపించాయి.

''ఇంత బీభత్సాన్ని సృష్టించే ఫ్రెండ్స్ నెందుకు తీసుకొచ్చావయ్యా బాబూ!'' విసుగ్గా అన్నాడు రాఘవయ్య.

''క్షమించండ మామగారూ! ఈ ఒక్క రోజుకు వాళ్లనేమీ అనకండి... ఎవరన్నా వాళ్లనేమన్నా అన్నారంటే వాళ్లింకా రెచ్చిపోతారు'' అన్నాడు పెళ్లికొడుకు.

పెళ్లికూతురి చూపులు ఓ క్షణంసేపు పెళ్లికొడుకు ముఖంమీద నిల్చాయి.

ఆ పెళ్లిని చూస్తున్నవాళ్లంతా ఇదేం చోద్యమంటే ఇదేం చోద్యమని ముక్కులమీద వేళ్లేసుకున్నారు.

''వాళ్లు హైదరాబాద్ నుంచి వచ్చారట! పెద్ద ఆఫీసర్లట. రాత్రి వాళ్ల కోసం కారు పంపించలేదని అలిగారట'' అంటూ ఆడవాళ్లలో గుసగుసలు ప్రారంభమయ్యాయి.

''పెళ్లి కానీయండి... వాళ్ల సంగతేమిటో చూద్దాం'' అన్నాడు శ్రీధర్ చుట్టూ వున్న తన మిత్రబృందంతో.

''నువ్వూరుకోరా శ్రీధర్! ఆడపిల్ల తరపు వాళ్లం కాబట్టి ఎట్లాంటివాళ్లనైనా... చివరకు బందిపోటు దొంగలనైనా భరించాలి - తప్పదు'' అన్నాడు మాధవయ్య.

మంగళసూత్ర ధారణ ఆపేసి అయ్యగారు వేరే మంత్రాలేవో చదవటం మొదలెట్టారు.

అక్కడున్న వాళ్లంతా తమ గడియారాల్ని పదేపదే చూసుకోసాగారు. యేడున్నరయింది. అందరూ హైదరాబాద్‌నుంచి వచ్చిన ఆ ఐదుగురు వి.ఐ.పీల కోసం ఎదురుచూడసాగారు.

''అయ్యా! పెళ్లికొడుకుగారా! ఇంకో రెండు నిమిషాల్లో మంగళసూత్ర ధారణ జరక్కపోతే స్వాతి నక్షత్రం వెళ్లిపోతుంది. ఆ తర్వాత మీ ఇష్టం - రేపేదన్నా అనర్థం జరిగితే నన్ను నిందించకూడదు'' అన్నాడు అయ్యగారు.

''పెళ్లి పందిట్లో అవేం మాటలండి... ఎవరన్నా వెళ్లి వాళ్లను త్వరగా రమ్మనండి'' అన్నాడు పెళ్లికూతురు తాతగారు.

''అయ్యా! పెళ్లికొడుకు గారూ! మీరు తాళి కట్టెయ్యండి. ఆ తర్వాత వాళ్లొచ్చి అక్షింతలు వేస్తార్లెండి'' అన్నాడు అయ్యగారు.

''వద్దండి... వద్దండి మా గురూ వచ్చి తాళి కట్టడానికి పర్మిషన్ ఇచ్చేదాకా నేను తాళి కట్టను'' చాలా దృఢంగా అన్నాడు పెళ్లికొడుకు.

పెళ్లికూతురు మరోసారి పెళ్లికొడుక్కేసి చూసి ఆ తర్వాత వాళ్ల నాన్నగారికేసి చూసింది.

''మీరు తాళి కట్టండి బావగారూ! వాళ్లేం చేస్తారో మేం చూస్తాం. ఎక్కువ తక్కువ మాట్లాడితే పట్టుకొని తంతాం'' అన్నాడు శ్రీధర్.

''మీరిక్కడ వాళ్లను పట్టుకుని తంతే అక్కడ నా ఉద్యోగం కాస్తా ఊడుతుంది'' అన్నాడు పెళ్లికొడుకు.

''అదీ నిజమే..... కొంచెం ఓపిక పట్టండి... కొంచెం ఓపిక పట్టండి'' అన్నాడు రాఘవయ్య.

అప్పుడొచ్చారు అయిదుగురు – చక్కగా ముస్తాబై... స్నో, పౌడర్ల వాసనలు గుబాళిస్తోంటే – జీన్స్, సఫారీ సూట్స్ తళతళ మెరిసిపోతుంటే... మెడల్లో కెమెరాలు వేలాడుతోంటే... అక్కడున్న వాళ్లంతా వాళ్లను ఏ అంగారక గ్రహంనుండో దిగిన వింత మనుషుల్ని చూసినట్టుగా కళ్లు పెద్దవి చేసుకుని చూశారు.

''అయ్యా! మీ కోసమే చూస్తున్నాము. రండి రండి ఇప్పటికే ముహూర్తం మించిపోయింది'' అన్నాడు అయ్యగారు.

''ముహూర్తం ఏమీ మించిపోదు – మేం ఎప్పుడొస్తే అప్పుడే ముహూర్తం – కానివ్వండి'' అన్నాడు గుర్నాథం.

మంగళసూత్రధారణ, తలంబ్రాలు, అక్షతలు... అన్నీ చకచకగా జరిగిపోయాయి. గుర్నాథం, హమీద్‌లు తమ కెమెరాలను క్లిక్ మనిపించారు. గుర్నాథం అక్షంతలు వేస్తోంటే హమీద్ ఫోటో తీశాడు. ఆ తర్వాత మిగతా వాళ్లంతా అక్షతలు వేశారు.

అందరూ లేచారు.

పెళ్లికొడుకు తరపున వచ్చిన అతని కజిన్స్, బావలు, మేనమామలు మొదలైన వాళ్లంతా రాఘవయ్య చుట్టూ చేరి ''రాత్రంతా మాకు నిద్రలేదు. తిండి లేదు. చలిలో పిల్లలూ, మేమూ చచ్చిపోయాం. ఇప్పటికైనా మాకేమన్నా తిండీ తిప్పలు చూస్తారా. ముహూర్తం టైమయిపోయిందని మేమందరూ స్నానాలు చేయకుండానే బస్సు దిగిన వాళ్లం దిగినట్టుగానే వచ్చేశాం'' అన్నారు.

''అందరూ విడిదికి వెళ్లి స్నానాలు చెయ్యండి. పదింటికల్లా భోజనాలు పెట్టించేస్తాను'' అన్నారు రాఘవయ్య.

అందరూ అక్కడికి దగ్గర్లోనేవున్న విడిదికి బయలుదేరారు. కొందరేమో ఆ ఊరికి దగ్గర్లో

పున్న చెరువు దగ్గర కెళ్లి స్నానాలు చెయ్యడం మొదలుపెట్టారు.

''ఇంతవరకు మీరు వంటలే ప్రారంభించినట్టు లేదు. పదింటికే భోజనాలెలా పెట్టిస్తారు'' అన్నాడు కేశవరావు రాఘవయ్యతో.

''రాత్రి వీళ్లొస్తారని వండిన వంటలన్నీ అలాగే వున్నాయండి. రాత్రి డిన్నర్‌కు అయిదువందల మంది వస్తారని వంటలు వండిస్తే కనీసం రెండు వందలమంది కూడా లేరు. బస్సు ఫెయిలౌతుందని మాకేం తెలుసు. బోల్డు మటన్, చికెన్, బోల్డు బిర్యానీ మిగిలిపోయాయి. వాటినే కొంచెం వేడి చేయించి వడ్డించేసి బస్సెక్కించేస్తే సరి'' అన్నాడు రాఘవయ్య.

''అందరూ చాలా కోపంగా ఉన్నారు. నిన్న వంటినవి పెట్టారని గొడవ చేస్తారేమో'' అన్నాడు కేశవరావు.

''నిన్న వండినవని వాళ్లకు తెలిస్తే గదా! వేడి చేయిస్తే ఫ్రెష్‌గా ఉంటాయి. మంచి ఆకలితో ఉన్నారు. ఆవురావురుమని తినేస్తారు'' అన్నాడు రాఘవయ్య.

వాళ్లలా మాట్లాడుతుండగానే అక్కడికి మాధవయ్య వచ్చాడు.

''ఆ అయిదుగురూ డ్రింక్స్‌మీద కూర్చున్నారు. వాళ్లకు తినటానికేం తీసికెళ్ల మంటారు?'' అన్నాడు రాఘవయ్యకేసి చూస్తూ.

''రాత్రి వండిన మటన్, చికెన్, ఫిష్, ఫోర్క్ అన్నీ అలాగే వుండిపోయాయి. వాటినే కొంచెం వేడి చేయించి తీసుకెళ్ళు'' అన్నాడు రాఘవయ్య.

''వాళ్లు మొదలే కోతులు. ఇప్పుడు తాగుతున్నారు. నిన్న వండిన మటన్ పెడ్తే మా ఇల్లు తీసి పందిరేస్తారేమో!'' అన్నాడు మాధవయ్య.

''వాళ్ల బొందలే... వేడి చేశాక నిన్నటివని వాళ్లసలు గుర్తుపట్టలేరు. ఒకవేళ గుర్తుపట్టినా వాడు చేసేదేముంది. పెళ్ళైతే అయిపోయింది. ఎన్ని బాటిల్స్ తెప్పించావు?'' అన్నాడు రాఘవయ్య.

''రెండు మెక్డోవెల్ ఫుల్. రెండేనా అని గోల చేస్తున్నారు. అవి అయిపోయి నీయండి. మళ్ళీ తెప్పిస్తాం అని చెప్పాను'' అన్నాడు మాధవయ్య.

''రెండు దండగ. ఒకటితో సరిపుచ్చాల్సింది.'' అన్నాడు రాఘవయ్య.

''వాట్ సిక్సిటీనైన్ తెప్పిస్తానని పెళ్లికొడుకు ప్రామిస్ చేశాడుట. అదెక్కడని వాళ్లడుగుతుంటే మీరలా అంటారేమిటి?'' అన్నాడు మాధవయ్య.

''వాట్ సిక్సిటీనైనా... వాడి బొందా... నేనసలు డ్రింక్స్ పెట్టుకోనని పెళ్లికొడుకుతో మొదలే చెప్పాను. ఇప్పుడు వీళ్లకు తాగిస్తున్న విషయం పెళ్లికొడుకు తరఫు మిగతా బంధువులకు తెలిస్తే వాళ్లతో ఏం గొడవో... అందర్నీ సాధ్యమైనంత త్వరగా బస్సెక్కించి చేతులు కడుక్కోవాలి...'' అన్నాడు రాఘవయ్య అక్కడ్నించి వంటల దగ్గరకు వెడుతూ.

''స్నానం చేద్దురుగాని రండి!'' అంటూ రాధ కేశవరావు దగ్గరికొచ్చింది.

''ఏమండీ! మీకో విషయం తెలుసా?'' అంది రాధ.

''ఏమిటీ?'' అన్నాడు కేశవరావు.

''రాత్రి మనం వచ్చి పెళ్లికొడుకు ఫ్రెండ్స్ కోసం కారు పంపించలేదని వాళ్లు మి నోటికొచ్చినట్టల్లా తిడ్తున్నారట...'' అంది రాధ.

''నీ పిచ్చిగానీ వాళ్లు నన్నెందుకు తిడ్తారే. నేను రాగానే బస్సు ఫెయిలయిందనీ, మరో వెహికల్ పంపించండని అటు పెళ్లికొడుక్కు, ఇటు రాఘవయ్యకు చెప్పాగా... అంతకంటే మనం ఏం చెయ్యగలం?'' అన్నాడు కేశవరావు.

''ఏమోనండి... నాకెందుకో భయంగా వుంది. పెళ్లయిపోయిందిగా. మనం వెంటనే ఏ ఆటోనో చూసుకుని మిర్యాలగూడెం దాకా వెళ్లి అక్కణ్ణించి బస్సులో వెళ్లిపోదాంగానీ మళ్లీ వీళ్లతో ఆ పాడు బస్సులో వెళ్లొద్దు'' అంది రాధ.

''అలాగే కొంచెం తిని బయటపడదాం. తినకుండా వెడితే బాగుండదేమో'' అన్నాడు కేశవరావు.

''మీకన్నీ మొహమాటాలే. ఏం తింటారు? అన్నీ నిన్న వండినవే పెడ్తారట... ఎవరినైనా మిర్యాలగూడెం పంపించి ఏ ఆటోనో, టాక్సీనో మాట్లాడుకుని రమ్మనండి...'' అంది రాధ.

అక్కడికెవరో రావడంతో రాధ అక్కడ్నించి వెళ్లిపోయింది.

* * *

మాధవయ్య ఇంట్లో పార్టీ జోరుగా సాగుతోంది.

అరగంటలోనే మొదటి బాటిల్ పూర్తయిపోయింది.

మటన్, చికెన్, ఫిష్ మొదలైనవి ప్లేట్ల కొద్దీ అయిపోతున్నాయి.

''ఇంకో అరగంటలో ఇదికూడా అయిపోతుంది. మన పని ఇంతేనా గురూ!'' అన్నాడు సూర్యనారాయణ రెండో బాటిల్ ఓపెన్ చేస్తూ. వెంటనే గుర్నాథం 'మాధవయ్యగారూ!' అంటూ కేకేశాడు.

''ఏం కావాలండీ?'' వస్తూనే అన్నాడు మాధవయ్య.

''కావాలంటే మేం డబ్బిస్తాం. మాకింకో ఫుల్ బాటిల్ తెప్పించండి'' అన్నాడు గుర్నాథం.

''మీరు డబ్బివ్వడం దేనికిలెండి. మేమే తెప్పిస్తాం. అది పూర్తికానివ్వండి'' అన్నాడు మాధవయ్య.

''అదింకో అరగంట కూడా ఆగదండి. మా రెడ్డికి, సూర్యనారాయణకు విస్కాసురులు అన్న బిరుదుంది. ఎంత విస్కీనైనా నీట్‌గా మంచినీళ్లలా తాగేస్తారు. కనీసం ఇంకో రెండు

బాటిల్సన్నా తెప్పించండి'' అన్నాడు గుర్నాధం.

''అలాగే లెండి...'' అంటూ మాధవయ్య వాళ్లున్న రూమ్‌లోంచి బయటకొచ్చి ''ఏం చేద్దామా?'' అని ఆలోచించసాగాడు. ఇప్పుడు మళ్లీ ఎవరినన్నా మిర్యాలగూడెం పంపించాలంటే ఆలస్యమైపోతుంది. వెంటనే ఆయన బుర్రలో ఓ ఆలోచన మెరిసింది. వాళ్ల ఊర్లో సారాయి దుకాణం ఉంది. ఓ లీటర్ సారా తెప్పించి దాన్ని మెకడొవెల్ బాటిల్లో పోసి అప్పుడే వాళ్లముందు తనే ఓపెన్ చేసినట్టుగా చేసి వాళ్లముందు పెట్టేస్తే సరి. రెండు ఫుల్ బాటిల్స్ కొట్టేశాక మూడో బాటిల్లో ఏముందో తెలుసుకునే శక్తి ఎవడికీ వుండదులే అనుకున్నాడాయన.

వాళ్లు అయిదుగురూ క్రమంగా వాళ్లు కోరుకునే మరో ప్రపంచంలోకి వెళ్లిపోవడం ప్రారంభించారు. సెక్స్ జోకులు... నవ్వులు... అరుపులు... ఒకరిమీదొకరు పడిపోవడాలు... వాళ్ల పై ఆఫీసర్లను గుర్నాధం ఎప్పుడెప్పుడు ఎలా తిట్టాడో గుర్తుచేసుకొని పొంగిపొర్లి నవ్వడం వాళ్లకు గంటలు క్షణాల్లో దొర్లిపోతున్నాయి. రెండో బాటిల్ పూర్తయ్యేటప్పటికి మాధవయ్య వాళ్లముందు మూడో బాటిల్ పెట్టాడు. సూర్యనారాయణ మూడో బాటిల్ ఓపెన్ చేశాడు.

పదకొండింటికల్లా పెళ్లికొడుకు తరపున వచ్చిన బంధువులందరూ స్నానాలు చేయడం ముగించుకొని, కొత్తబట్టలు వేసుకొని రాఘవయ్య ఇంటి దగ్గరకొచ్చి భోజనాలెప్పుడు పెడ్తారా అని ఎదురుచూడసాగారు. పదకొండున్నరకల్లా అందర్నీ భోజనాలకు కూర్చోబెట్టి వడ్డించడం మొదలెట్టారు.

''ఛీ ఛీ! అన్నీ నిన్న వండినవే పెట్టారు...'' అకస్మాత్తుగా అన్నాడు రాజేందర్.

''ఔను... అన్నీ నిన్నటివే... వాళ్లు మనల్ని అలగాజనం కంటే, బిచ్చగాళ్లకంటే హీనంగా చూస్తున్నారు...'' అన్నాడు ఉపేందర్.

''మనం అలగాజనంలాగే వాళ్లు పెట్టినవన్నీ ఆవురావురుమని తింటున్నాము కాబట్టి వాళ్లు పెడ్తున్నారు. వాళ్ల తప్పేముంది?'' అన్నాడు పెళ్లికొడుకు బావ కృష్ణమూర్తి.

''అందరూ తినడం ఆపేసి లేచి చేతులు కడుక్కోండి'' అన్నాడు రాజేందర్.

వెంటనే అందరూ భోజనాలమీది నుంచి లేచి చేతులు కడుక్కోవడం మొదలెట్టారు.

''యేమండి! ఎందుకు లేస్తున్నారు? యేమయ్యింది?'' అన్నాడు ఈ వార్త విని అక్కడికి పరిగెత్తుకొని వచ్చిన రాఘవయ్య.

''యేమైందా? నిన్న వండినవన్నీ మా మొఖాన పారేసి యేమయింది అని అడుగుతున్నారా? మేమంటే ఇంత నిర్లక్ష్యమా? పెళ్లికొడుకు ఫ్రెండ్స్‌కేమో విస్కీలు, బ్రాందీలు... మాకేమో పాచిపోయిన అన్నం కూరలు... పెళ్లికొడుకు మీవాడై పోయాడు. మమ్మల్ని మీరెందుకు చూస్తారు. ఇంత అవమానం జరిగాక మేమిక్కడ ఒక్క క్షణం కూడా ఉండదల్చుకోలేదు...'' అన్నాడు రాజేందర్.

''రాత్రి మీరొస్తారని ఆరు మేకపోతుల్ని కోయించాను... బస్సు ఫెయిలవుతుందని నాకేం తెలుసు? మటనంతా అలాగే వుంది. చలికాలమేగా వేడి చేయించి వడ్డించాం. దీనికింత రాద్ధాంతం చేస్తున్నారేమిటి?'' అన్నాడు రాఘవయ్య.

''ఔనండి మేమే రాద్ధాంతం చేస్తున్నాము. మాకు మీరు విస్కీలు, బ్రాందీలు పోయిస్తే మేమే రాద్ధాంతం చేస్తున్నాము. అందరూ పదండి. ఒక్క క్షణం ఇక ఈ ఊళ్ళో ఉండొద్దు. అందరూ వెళ్ళి బస్సెక్కండి'' అన్నాడు రాజేందర్.

ఈలోగా ఎవరో వెళ్ళి అక్కడికి పెళ్ళికొడుకును తీసుకువచ్చారు. పెళ్ళికొడుకును చూడగానే రాజేందర్ అతనిమీద విరుచుకుపడ్డాడు.

''వరేయ్! నువ్వు మీ మామగారు ఒకటైపోయార్రా! మేమెందుకు? నువ్వు నీ ఫ్రెండ్సును చూసుకున్నావుగానీ మమ్మెల్నెందుకు చూస్తావు. రాత్రంతా తిండి లేక మేమెన్ని అవస్థలు పడి ఇక్కడికొచ్చామో నీకెందుకు? మా మొఖాన మీ మామగారు పాచిపోయిన అన్నం పడేసినా నువ్వు మాటాడవు. అసలు నీ పెళ్ళికి రావడం మా బుద్ధి తక్కువ'' అన్నాడు రాజేందర్.

క్షణంలో అందరూ ఊరి బటయ ఆగివున్న బస్సు దగ్గరకు బయల్దేరారు. ఎవరైనా వచ్చి వాళ్లను బతిమాలాడుతారేమోనని ఆశించారు. కాని అలాంటిదేమీ జరగలేదు. పెళ్లికొడుకు నోరు తెరుచుకుని అలా వుండిపోయాడే కాని ఒక్క మాట కూడా మాట్లాడలేకపోయాడు.

''అసలిదంతా నీ ఫ్రెండ్స్‌కు సెపరేట్‌గా డ్రింక్స్ అరేంజ్ చేయడంవల్ల వచ్చింది'' అన్నాడు రాఘవయ్య అల్లుడ్ని చూస్తూ.

''ఇప్పుడేం చేద్దాం మరి? పాపం వాళ్లు రాత్రి కూడా తిన్లేదు. మన ఊర్లో సారా ఎంత కావాలంటే అంత దొరుకుతుంది. తెప్పించి పోస్తే వాళ్ల కోసం పోతుందేమో'' అన్నాడు వెంకట్రామయ్య – రాఘవయ్య బావమరిది.

''వాళ్లందర్నీ ఇప్పుడు బతిమిలాడి సారా తెప్పించి పోస్తే ఈ రోజంతా ఇక్కడే వుండి పోతారు. వెళ్లిపోయే వాళ్లను ఆపటం ఎందుకు? పెళ్లయితే అయిపోయింది. ఇప్పుడు మనల్ని ఎవరూ ఏమీ చెయ్యలేడు'' అన్నాడు రాఘవయ్య.

పెళ్లికొడుకు తరఫు బంధువులందరూ విడిదికి వెళ్లి పెళ్లికూతురు తండ్రిని తిట్టుకుంటూ హడావుడిగా తమ సామాన్లను సర్దుకొని బస్సు దగ్గరకు వెళ్లడం మొదలుపెట్టారు. అంతకుముందే భోజనం చేసొచ్చిన డ్రైవర్ సాధ్యమైనంత త్వరగా హైదరాబాద్ చేరాలని బస్సు హారన్‌ను అదేపనిగా మోగించసాగాడు.

మాధవయ్య ఇంట్లో వున్న ఆ ఐదుగురు మూడో బాటిల్ పూర్తిచేసి నాల్గోది స్టార్ట్ చేశారు.

వేడిచేసిన మటన్ అయిపోవడంతో మాధవయ్య పాలేరు నిన్న వండిన మటన్ ముక్కల్ని వేడి చెయ్యకుండానే వాళ్లముందు పెట్టాడు. దాంట్లోంచి ఒక ముక్కను నోట్లో వేసుకున్న రెడ్డి వెంటనే –

''వరేయ్ గురూ! ఈ మటన్ నిన్నటిదిలా ఉందిరా'' అరిచాడు.

''ఔన్రేయ్.... నాక్కూడా అదే డౌటొచ్చింది. మనం ఇంతవరకు తింటున్నదంతా నిన్న వండిందే'' అన్నాడు హమీద్.

''మరో విషయం... అసలు మనం తాగుతున్నది విస్కీ కాదు. సారా... నాటుసారా'' అన్నాడు సూర్యనారాయణ.

''ఆ... ఎంత మోసం... ఎంత దగా... వీళ్లకెన్ని గుండెలు... మనకు... మనకు నిన్నటి మటన్ పెడ్తారా'' అంటూనే గుర్నాథం అక్కడున్న బాటిల్స్ నన్నింటిని బద్దలు చేశాడు. మిగతా నల్గురు వాళ్ల చేతుల్లో ఉన్న గాజుగ్లాసుల్ని నేలకేసి కొట్టారు. ఆ రూమ్‌లో ఉన్న కుర్చీలను, మంచాలను విరగ్గొట్టారు. గోడలకున్న ఫోటోలను, బొమ్మలను లాగేసి నేలకేసి కొట్టారు.

''యేమిటండీ బాబూ! యేమిటిదంతా...'' అంటూ ఆ రూంలో కొచ్చిన మాధవయ్య పాలేరును జుట్టుపట్టుకుని ఎడాపెడా బాదెయ్యసాగారు. ఇదంతా చూసి ఆ రూంలోకి రాబోయిన మాధవయ్య గుమ్మం దగ్గరే ఆగిపోయాడు.

''రారా... రా! మాకు నిన్నటి మాంసం పెడ్తావుగదూ! ఇప్పుడు నీమాంసం తింటాం. ఎవడడ్డమొస్తాడో చూస్తాం'' అంటూ విరిగిపోయిన కుర్చీ కాలును చేతిలో పట్టుకుని గుర్నాథం మాధవయ్య మీదకు వెళ్లడానికి సిద్ధమయ్యాడు.

పరిస్థితిని అర్థం చేసుకున్న మాధవయ్య మరుక్షణంలో వెనక్కి తిరిగి పెళ్లింటివైపు పరిగెత్తాడు.

పెళ్లి పందిట్లోకి వచ్చి అక్కడున్న ఫర్నిచరంతా ధ్వంసం చేయడం మొదలెట్టారు. అక్కడున్న వాళ్లంతా భయంతో అరుస్తూ ఎటు దారి దొరికితే అటు పరిగెత్తడం మొదలెట్టారు. వాళ్లు ఐదుగురు చేతికి యేది దొరికితే దాన్ని రాఘయ్య బంధువుల మీదకు విసరటం మొదలెట్టారు. యేం జరుగుతున్నదో ఎవరికీ అర్థం కావడం లేదు. యేడ్పులు... పెడబొబ్బల్తో జనం పిచ్చిగా పరుగెత్తసాగారు.

యేం జరుగుతున్నదో చూద్దామని ఇంట్లోంచి బయటికొచ్చిన కేశవరావుమీద గుర్నాథం దృష్టి పడింది.

''వీడే కదరా పెళ్లి పెద్ద... ఈ పెళ్లి కుదిరించింది వీడే కదూ!'' అన్నాడు గుర్నాథం.

''ఔన్రా గురూ! అందరికంటే ముందు వీడిపని పట్టాలి'' అన్నాడు కిశోర్.

''ఔను... అందరికంటే ముందు వీడ్ని పంపించెయ్యాలి'' అంటూనే గుర్నాథం తన చేతిలో వున్న గుండ్రాయిని కేశవరావు మీదకు విసిరేశాడు. ఆ రాయొచ్చి కేశవరావు తలకు తగలడం, తల పగిలి రక్తం ప్రవహించడం లిప్తపాటులో జరిగిపోయింది. చేతిలో తలను పట్టుకుని కేశవరావు భూమ్మీద పడిపోయాడు.

అందరూ 'అయ్యో! అయ్యో!' అంటూ అతని చుట్టూ చేరిపోయారు.

''వరేయ్ గాడిద కొడుకుల్లారా! ఇంత దారుణానికి తెగిస్తార్రా... మీ ఐదుగుర్నీ ఈ ఊరి ముత్యాలమ్మకు బలియ్యకపోతే నా పేరు తీసి మారుపేరు పెట్టండిరా...'' అని పెద్దగా అరుస్తూ చేతిలో కర్ర పట్టుకుని శ్రీధర్ వాళ్లమీదకు వెళ్లబోయేడు.

''వరేయ్ గురూ! మనం వెంటనే ఇక్కణ్ణించి వెళ్లకపోతే అందరూ కలిసి మనల్ని చంపేస్తారు... కమాన్ లెటజ్ గో'' అన్నాడు కిశోర్.

వెంటనే వాళ్లు ఐదుగురూ అక్కడ్నించి కదిలి ఊరి బయటకు పరిగెత్తారు. వాళ్ల చేతుల్లో వున్న కర్రలు, రాళ్లు, బాటిల్స్ చూసి ఎవరూ వాళ్లను ఆపటానికి సాహసించలేకపోయారు.

వాళ్లనెలాగయినా పట్టుకోవాలని రాఘవయ్య బంధువుల్లో యువకులైన వాళ్లు కొందరు, ఆ ఊరి శ్రీధర్ ఫ్రెండ్స్ కొందరు వాళ్లను అనుసరించారు. అయితే వాళ్లందరూ కలిసి గుర్నాధం ముఠాను వెంటాడే లోపలే గుర్నాధం వాళ్లు బస్సు దగ్గరకు వచ్చేశారు. వాళ్లు ఐదుగురూ బస్సులో జొరబడి డ్రైవర్‌తో...

''డ్రైవర్ వెంటనే బస్సు స్టార్ట్ చేసి పోనీయ్! లేకపోతే నీ ప్రాణాలూ, మా ప్రాణాలు పోతాయి. ఆడపెళ్లి వాళ్లందరూ మనమీద దండెత్తి వస్తున్నారు. రాత్రి నువ్వు బస్సును కావాలనే ఫెయిల్ చేశావని మొదలు నిన్ను తంతారట. అదిగో చూడు'' అన్నారు.

బస్సు కదలగానే బస్సులో కూర్చున్న సురేందర్ బంధువులందరూ పెద్దపెట్టున అరిచారు.

''బస్సును ఇంకాస్సేపు ఆపండి. మావాళ్లింకా చాలామంది రాలేదు. విడిదిల్లో ఇంకా తమ సామాన్లు సర్దుకుంటున్నారు'' అన్నారు.

గుర్నాధం వాళ్లందరికీ తన చేతిలో వున్న రాళ్లను చూపిస్తూ -

''ఎవరూ అరవొద్దు. అరిచారంటే తలలు పగుల్తాయ్ అన్నాడు. మిగతా నల్గురు కూడా తమ చేతుల్లో వున్న ఆయుధాలను వాళ్లకు చూపించి నోరు మూసుకోండి'' అన్నారు.

వెంటనే అందరూ భయంతో నోళ్లు మూసుకున్నారు.

బస్సు వేగాన్ని పుంజుకుని ముందుకెళ్లిపోయింది.

విడిదిలోంచి తమ సామాన్లు పట్టుకొని బస్సు దగ్గరకొస్తున్న పెళ్లికొడుకు, మిగతా బంధువులు వెళ్లిపోతున్న బస్సును చూసి హతాశులైపోయి 'ఆపండి... బస్సును ఆపండి...' అంటూ తమ శక్తికొద్దీ అరిచారు. కాని వాళ్ల అరుపుల్ని ఎవరూ పట్టించుకోలేదు. ★

ఆంధ్రజ్యోతి వార పత్రిక: 27.1.89